క్లుప్తంగా

'ఉద్యోగుల సమస్యలపై సీఎంతో చర్చిస్తాం'



విలేకర్లతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఏలూరు(మెట్రో): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు, పలు డిమాండ్లపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చిస్తామని ఎన్‌జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, జేఏసీ జిల్లా చైర్మన్ చోడగిరి శ్రీనివాసరావు తెలిపారు. ఏలూరు పంచాయతీరాజ్ మినిస్ట్రీరియల్ ఉద్యోగుల సంఘం భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి నెరుసు రామారావు, జేఏసీ కన్వీనర్ ఎస్ రామారావు, పీఆర్‌టీయూ, యూటీఎఫ్ సంఘాల నాయకులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్సై

ఏలూరు టౌన్: రాబోయే సార్వత్రిక ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించేందుకు ముందస్తుగా పటిష్ట చర్యలు చేపట్టారు. ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీప్రశాంతి ఆదేశాల మేరకు రూరల్ ఎస్సై కె.రాజారెడ్డి ఏలూరు రూరల్ పరిధిలో ఉన్న గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు అవసరమయ్యే సదుపాయాలపై ఆరా తీశారు. ఏలూరు రూరల్ తహసీల్దార్ నరసింహారావు, తన సిబ్బందితో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పైడి చింతపాడు, చాటపర్రు, ప్రత్తికోళ్లలంక, మొండికోడు, కోటేశ్వరదుర్గాపురం, గుడివాకలంక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆ గ్రామాలకు వెళ్లే మార్గాలు, రక్షణ చర్యలపై పరిశీలన చేశారు.

మద్యం విక్రేత అరెస్ట్

ఏలూరు టౌన్ : ఏలూరు రూరల్ మండలం కొత్తూరు ఇందిరమ్మ కాలనీలో ఒక వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా ఏలూరు రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై కె.రాజారెడ్డికి అందిన సమాచారం మేరకు ఘటనా స్థలిలో మద్యం విక్రయిస్తున్న బారు రాజా అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. తొమ్మిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

ఏలూరు టౌన్: ఏలూరు కొమడవోలు ప్రాంతానికి చెందిన ఒక ఆటో డ్రైవర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆటో యూనియన్ అతన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారనే కారణంగా తీవ్ర మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు చెబుతున్నారు. ఏలూరు కొమడవోలు ప్రాంతానికి చెందిన చలపరెడ్డి మురళి (45) గతంలో ఆశ్రం కళాశాల జంక్షన్‌లో ఒక హోటల్ నిర్వహించేవాడు. ఆశ్రం జంక్షన్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య నేపథ్యంలో షాపులన్ని తొలగించారు. అనంతరం మురళి ఆటోను కొనుగోలు చేసి అదే సెంటరులో ఆటోను నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతను మద్యం తాగి ఆటోను నడపడంతో యూనియన్ కమిటీ 15 రోజుల పాటు ఆటో నడపవద్దని, మద్యం తాగితే ప్రయాణీకుల ప్రాణాలకు ప్రమాదం ఉందని సూచించారు. ఆటో నడపటం మానివేసి హోటల్ పెట్టే ప్రయత్నం చేశాడు. ఆశ్రం సెంటర్‌లోని పాత హోటల్ స్థలంలో హోటల్ పెట్టేందుకు ప్రయత్నించగా అదే స్థలంలో ఆటో యూనియన్ స్టాండ్ అని బోర్డు పెట్టడంతో మనస్థాపానికి గురై మంగళవారం మధ్యాహ్నం అక్కడే పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నాడు. పక్కనే ఉన్న ఏలూరు కాలువలో దూకేశాడు. తీవ్ర గాయాలపాలైన మురళిని ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరుకు రిఫర్ చేశారు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు మెడికో లీగల్ కేసుగా నమోదు చేసి ఆసుపత్రి ఔటో పోస్టు పోలీసులకు సమాచారం అందించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ ప్రభాకర్



జూదరులను అదుపులోకి తీసుకున్న ఎస్ఈబీ అధికారులు

టూటౌన్ సీఐ ఎం ప్రభాకర్

ఏలూరు టౌన్: ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని టూటౌన్ సీఐ ఎం ప్రభాకర్ హెచ్చరించారు. ఏలూరు టూటౌన్ పరిధిలోని తంగెళ్లమూడి, కబాడిగూడెం, అంబేడ్కర్ నగర్ తదిత ర ప్రాంతాల్లో సీఐ ప్రభాకర్ సిబ్బందితో కలిసి ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో తిరుగుతూ ప్రజలకు పోలీస్ సేవలపై అవగాహన కల్పించారు. నేరాలకు పాల్పడే వారి పట్ల ఏ విధంగా వ్యవహరించాలనే అంశాలను ప్రజలకు వివరించారు. బహిరంగంగా మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మహిళలు, విద్యార్థినులు, యువతుల పట్ల ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు కఠినంగా వ్యవహరిస్తామన్నారు. రాత్రిపూట గస్తీతో పాటు పగటివేళల్లో సైతం పెట్రోలింగ్‌ను మరింత సమర్థవంతంగా చేపట్టేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

సత్రంపాడులో జూదరుల అరెస్ట్

ఏలూరు టౌన్: ఏలూరు సత్రంపాడు ప్రాంతంలో ఒక అపార్ట్‌మెంట్‌లో పేకాట శిబిరంపై ఎస్పీ డి.మేరీప్రశాంతి ఆదేశాల మేరకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో ఎస్ఈబీ అధికారులు దాడి చేశారు. మంగళవారం సాయంత్రం సత్రంపాడు సీతారామ్‌పూర్ అపార్ట్‌మెంట్‌లో పేకాట శిబిరంపై దాడి చేసిన ఎస్ఈబీ సీఐ సునీల్ కుమార్, సిబ్బంది పేకాటాడుతున్న 12 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.42 వేల నగదు, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పేకాట ఆడుతున్న వ్యక్తులను, నగదు, సెల్‌ఫోన్లను ఏలూరు త్రీటౌన్ సీఐ వి.వెంకటేశ్వరరావుకు అప్పగించారు. ఈ మేరకు ఆయన కేసు నమోదు చేశారు.

విజ్ఞానం పెంపొందించుకోండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న యువజన సర్వీసుల శాఖ రాష్ట్ర కమిషనర్ శారదా దేవి

ఏలూరు (ఆర్ఆర్‌పేట) /ఏలూరు (మెట్రో) : యువత సోషల్ మీడియాను వీడి విజ్ఞానం పెంపొందించుకోవడంపై దృష్టి కేంద్రీకరించాలని రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ కమిషనర్, ఏపీ స్టెప్ మేనేజింగ్ డైరెక్టర్ కె.శారదా దేవి పిలుపునిచ్చారు. సెట్‌వెల్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సీఆర్ఆర్ మహిళా కళాశాలలో విద్యార్థినులకు వక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శారదా దేవి మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని, తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి మొబైల్, ఇంటర్‌నెట్ వంటి చిన్నచిన్న త్యాగాలు చేయాల్సి ఉంటుందని చెప్పారు. కెరీర్ కౌన్సిలర్ ఆర్ విజయ కుమార్, జి.ప్రవీణ్ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలకు వెళ్లడానికి వేకువజామున లేచి పట్టుదలతో చదవడం ద్వారా జ్ఞానం సంపాదించాలని, ఆ జ్ఞానంతో లక్ష్యాలను సాధించాలని సూచించారు. ప్రణాళికతో కూడిన విద్యాభ్యాసం చేయడం ద్వారా విజయాలు పాదాక్రాంతం అవుతాయన్నారు. ఏలూరు దిశ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.విశ్వం మాట్లాడుతూ ఇన్‌స్టా గ్రామ్ వంటి సోషల్ మీడియాల వల్ల విద్యార్థుల జీవితాలు తారుమారౌతాయని, వాటి జోలికి పోవద్దని ఉదాహరణలతో హెచ్చరించారు. కార్యక్రమంలో సెట్‌వెల్ సీఈఓ ఎండీహెచ్ మెహర్రాజ్, సెట్‌వెల్ మేనేజర్ పీవీఎన్ సత్యనారాయణ, పర్యవేక్షకులు కేజే కెనడీ, అక్కౌంటెంట్ పసుపులేటి ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ పి.శైలజ, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సీఎం జగన్ కృషి



జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ అయిన కొవ్వలి ఉన్నత పాఠశాల

పెదవేగి/దెందులూరు : దెందులూరు నియోజకవర్గాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా అభివృద్ధి చేసి, గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికంగా వెనుకబడిన బడుగు బలహీన వర్గాల కుటుంబాల విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేసిన ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి ప్రజలు జేజేలు పలుకుతున్నారు. మంగళవారం పెదవేగి మండలం కొండలరావుపాలెం ఎమ్మెల్యే పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ నాణ్యమైన విద్యనందించి విద్యార్థుల్లోని నైపుణ్యతకు పదును పెట్టి వారు ప్రపంచస్థాయిలో పోటీ పడేవిధంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కొఠారు అన్నారు. దెందులూరు నియోజకవర్గంలోని పెదవేగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దెందులూరు మండలం కొవ్వలి జెడ్పీ ఉన్నత పాఠశాలలను హైస్కూల్ ప్లస్‌గా అప్ గ్రేడ్ చేస్తూ ప్రభుత్వ ఆదేశాలు జారీ చేసిందని ఆయన ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి చొరవతోనే ఇది సాధ్యపడిందని పలువురు నాయకులు ప్రశంసించారు. నియోజకవర్గంలో రెండు పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ధన్యవాదాలు తెలిపారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పు



వసంతవాడలో ప్రజా ఆశీర్వాదయాత్రలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదపాడు: గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్థికంగా వెనుకబడిన బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు దెందులూరు నియోజకవర్గాన్ని విద్యా హబ్‌గా మారుస్తామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. పెదపాడు మండలంలోని వసంతవాడలో ప్రజా ఆశీర్వాదయాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన ప్రజలకు అభివాదం చేస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేకుందు కృషి చేస్తున్నారు. అడుగడుగునా స్థానికులు అబ్బయ్యచౌదరికి పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. వసంవాడలో రూ.3 లక్షల వ్యయంతో నిర్మించిన మంచినీటి బోర్‌ను స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పెదపాడు మండలం కలపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ప్లస్-2 స్థాయికి అప్‌గ్రేడ్ చేశారన్నారు. రాష్ట్రంలోని విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా వారిని తీర్చిదిద్దేందు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. విద్యావ్యవస్థలో పెనుమార్పులు తీసుకువస్తూ నూతన వరవడిని సృష్టిస్తూ ఎన్నడూ లేని విధంగా పాఠశాలలో రూపు రేఖలను మార్చుచేయడంతో పాటు విద్యార్థుల్లో నైపుణ్యాన్ని మెరుగుపర్చేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పాఠశాలతో పాటు కళాశాలలను కూడా నాడు-నేడు పథకంలో అభివృద్ధి చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మన బడి నాడు-నేడు ఫేజ్-1లో 19.2 లక్షల నిధులతో ఆధునీకరించిన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, గోగుంట సొసైటీ అధ్యక్షుడు భావరాజు సత్యన్నారాయణ, ఎంపీటీసీ కలపాల ఆదిలక్ష్మి, గ్రామ సర్పంచ్ చింతల రమాభారతి, స్థానిక నాయకులు గొంగాడ వెంకట్రావు, ఏలూరు ఎంపీపీ పెనుమత్స శ్రీనివాసరాజు, సంబంగి శ్రావణ్‌కుమార్, ముక్కు సత్యన్నారాయణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు చింతల ఆనంద్, ఉప సర్పంచ్ ఫణీంద్ర, స్థానిక నాయకులు తుమ్మల గోపాల కృష్ణ, గంగాడ వెంకట్రావు, అయూబ్‌ఖాన్, విజయరాజు పాల్గొన్నారు.

ఆటో బోల్తా, ప్రయాణికులకు గాయాలు

ఏలూరు టౌన్: ఏలూరు శనివారపుపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద ఆటోకు మోటారుసైకిల్ అడ్డు రావడంతో అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో ఆటోలో ఉన్న ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఏలూరు శాంతినగర్ 9వ రోడ్డుకు చెందిన ఆటో డ్రైవర్ రఘు తన ఆటోలో ఫిరంగుల దిబ్బ ప్రాంతానికి చెందిన తల్లిబోయిన కుమారి, తల్లిబోయిన ఇంద్రజ, కారేటి దుర్గ, పాత్రపోయిన రాజరాజేశ్వరిలను కూలి పనులు నిమిత్తం పెదవేగి మండలం పినకడిమి తీసుకువెళ్తున్నాడు. మార్గంమధ్యలో శనివారపుపేట పీహెచ్‌సీ వద్ద ఆకస్మికంగా మోటారు సైకిల్ అడ్డురావడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్నవారికి గాయాలయ్యాయి. వారిని ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా వైద్యులు ప్రాథమిక చికిత్స అందించారు. ఆసుపత్రి వైద్యులు మెడికోలీగల్ కేసుగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం అందించారు.

ఆటల్లో నైపుణ్యం సాధించాలి



నా ఈ దిశ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు

ఏలూరు (టూటౌన్): విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ డీజీఎం (ఏపీ, తెలంగాణ) వి.కుమార్ అన్నారు. స్థానిక శనివారపుపేట ప్రభుత్వ బాలుర వసతి గృహంలో నా ఈ దిశ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్ స్పోర్ట్స్ కిట్‌లను అందజేస్తున్నట్టు చెప్పారు. ఆయా ఆటల్లో నైపుణ్యం సాధించేందుకు శిక్షకులనూ ఏర్పాటు చేశామని, విద్యార్థులు పూర్తి స్థాయిలో నైపుణ్యం సాధించేంత వరకు శిక్షకులు కొనసాగుతారని తెలిపారు. కార్యక్రమంలో ఐఓసీ మేనేజర్ జేబీఎస్ విద్యాధర్, సెక్షన్ ఆఫీసర్ పి.తిమ్మప్ప, వసతి గృహం చీఫ్ ప్రొబేషన్ సూపరింటెండెంట్ టి.మధుసూదనరావు, డాక్టర్ పి.కిషోర్, డాక్టర్ మోహనరావు, జేవీఎల్ సత్యనారాయణ, వసతి గృహం సిబ్బంది పాల్గొన్నారు.

నిర్బంధ చర్యలు దారుణం

ఏలూరు (టూటౌన్): రైతుల ఛలో ఢిల్లీ కార్యక్రమంపై కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిర్బంధ చర్యలకు దిగడం దారుణమని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ విమర్శించారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవాలని, రైతుల రుణమాఫీ చేయాలని, రైతులపై అక్రమ కేసులను ఎత్తివేయాలని, ఢిల్లీ ఉద్యమంలో మరణించిన రైతు కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు.

వైఎస్సార్ జలకళ.. అన్నదాతలకు వరం

- వర్షాల కోసం ఎదురు చూడనవసరం లేదు
- నీటి ఎద్దడిని అధిగమించి జల సిరులు
- ఉచితంగా బోర్లతో పాటు విద్యుత్ కనెక్షన్లు, మోటార్లు మంజూరు



సానిగూడెంలో వైఎస్సార్ జలకళ పథకంలో బోరు వేస్తున్న దృశ్యం



వైఎస్సార్ జలకళలో బోరును రైతు ఫ్రాన్సిస్‌తో కలిసి ప్రారంభిస్తున్న సానిగూడెం సర్పంచ్ శనపల్లి విష్ణు

దెందులూరు: రాష్ట్ర ప్రభుత్వం మెట్ట పొలాల్లో సిరులు పంటలు పండేలా చర్యలు చేపట్టి రైతులందరికీ వెన్నుదన్నుగా నిలుస్తోంది. వర్షాలపై ఆధారపడిన రైతులకు వరుణుడి కోసం ఎదురుచూసే కష్టాలను తప్పించేందుకు ప్రభుత్వం వైఎస్సార్ జలకళ పథకాన్ని తెచ్చింది. దీంతో లక్షలాది రూపాయలు వెచ్చించి చిన్న, సన్న కారు రైతులు బోర్లు వేసుకునేలా చర్యలు చేపట్టి జల సిరులు కురిపిస్తోంది. బోర్లతో పాటు విద్యుత్ మోటార్లు, విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తోంది. ఈ పథకంలో ఒక్కొక్క రైతుకు సుమారు రూ.4 లక్షల వరకు ప్రయోజనం చేకూరుతుంది.

రైతులకు వరం

వైఎస్సార్ జలకళ పథకం రైతులకు వరంగా మారింది. గ్రామాల్లో బోర్లకు వీఆర్వోల అనుమతి పొందాక గనుల శాఖాధికారులు తనిఖీ చేస్తారు. తదనంతరం డ్వామా ఏపీడీ స్థాయి అధికారుల పర్యవేక్షణలో ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ పారదర్శకంగా పనులు జరుగుతున్నాయి. జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా భూగర్భ జలాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నారు. ఫలితంగా గ్రామాల్లో బోర్లు విజయవంతంగా పనిచేస్తూ రైతులకు అక్కరకు వస్తున్నాయి.

ఉచితంగా విద్యుత్ కనెక్షన్

వైఎస్సార్ జలకళలో భాగంగా తవ్వని వ్యవసాయ బోర్లకు కూడా ఉచితంగా విద్యుత్ కనెక్షన్ కల్పిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు తగు చర్యలు చేపట్టారు. రైతులు విద్యుత్ కనెక్షన్ అనుమతుల కోసం దరఖాస్తు చేసి అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా పోయింది.

నాడు- నేడు

గత ప్రభుత్వ హయాంలో టీడీపీ అనుచరుల పొలాల్లో మాత్రమే బోర్లు వేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక పారదర్శకంగా రైతులకు బోర్లు మంజూరు చేశారు. బోరు తవ్వకం మొదలు పొలంలో నీరు పారించే వరకు ప్రభుత్వమే బాధ్యత తీసుకుంటోంది. విద్యుత్ కనెక్షన్లతో పాటు మోటార్లను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. నియోజకవర్గంలో మొత్తం 233 బోర్లు రైతులు వైఎస్సార్ జలకళ పథకంలో వేయించుకున్నారు.

నియోజకవర్గం వివరాలు	బోర్ల సంఖ్య
దెందులూరు మండలంలో	140
పెదవేగి మండలంలో	65
పెదపాడు మండలంలో	28

వ్యవసాయానికి పెద్దపీట



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయన తండ్రి వైఎస్సార్ బాటలో పయనిస్తున్నారు. వ్యవసాయానికి పెద్దపీట వేశారు. బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయిస్తున్నారు. తండ్రి మాదిరిగానే రైతుల అభివృద్ధి, వ్యవసాయాభివృద్ధికి తొలి ప్రాధాన్యతనిస్తూ రైతుల భవిష్యత్తు, భద్రత కోసం సేవలందిస్తున్నారు.

– కొఠారు అబ్బయ్యచౌదరి, ఎమ్మెల్యే, దెందులూరు

జగనన్న ఇచ్చిన వరం



నా పొలంలో బోరు వేసుకోవాలని చాలాసార్లు అనుకున్నా. ఆర్థిక ఇబ్బందుల కారణంగా సాధ్య పడలేదు. పొలం ఉండి కూడా సాగు చేయలేని పరిస్థితి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాకు వరంలా వైఎస్సార్ జలకళ పథకం అమలు చేస్తున్నారు. బోరు వేయడంతో పాటు మోటారు, విద్యుత్ కనెక్షన్లు ఉచితంగా ఇచ్చారు.

– మాగంటి నాగరాజు, రైతు, దెందులూరు

పేద రైతులందరికీ ఎంతో మేలు



పేదలందరికీ వైఎస్సార్ జలకళ పథకంలో ఉచిత బోరునువేయడం, విద్యుత్ మోటారు, విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంతో ఎంతో మేలు జరుగుతోంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా పేద రైతుల కుటుంబాలకు భద్రత లభించింది. వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంది. బోరు ఆధారంగా పంటలు సాగు చేసుకుంటున్నాం.

– కూరంశెట్టి సత్యనారాయణ, రైతు, దెందులూరు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	29
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.30	40
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	32
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	24

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	14
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	17
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	14
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	26
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	19
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	10
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34

గోపన్నపాలెం- రామశింగవరం రహదారి నిర్మాణం పూర్తి



గోపన్నపాలెం - రామశింగవరం రహదారి నిర్మాణ పనులు పూర్తి చేసిన దృశ్యం

పెదవేగి : 30 ఏళ్లగా ప్రజల ఎదుర్కొంటున్న గోపన్నపాలెం- రామశింగవరం రహదారి సమస్యను తెలుసుకుని రూ.3 కోట్లు కేటాయించి పరిష్కరించడంపై గోపన్నపాలెం, రామశింగవరంతోపాటు సమీప గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిపై ప్రజలు ప్రశంసల జల్లు కరిపిస్తున్నారు. గోపన్నపాలెం నుంచి దిబ్బగూడెం, పెదవేగి, కూచింపూడి, రామసింగవరం వరకు గల రహదారి అభివృద్ధికి నోచుకోలేదు. గుంతలు, గోతులతో రహదారి తూట్లు పడి ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడేవారు.

అబ్బయ్యచౌదరి చొరవతో రోడ్లకు మహర్దశ

ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి 2019 ఎన్నికల బరిలోకి తొలిసారిగా అడుగుపెట్టినా అలు పెరగకుండా నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా కృషి చేశారు. అబ్బయ్యచౌదరి ఎన్నికల ప్రచారానికి రామసింగవరంలో పర్యటించినప్పుడు స్థానిక ప్రజలు రహదారి దుస్థితిని వివరించారు. దీనిపై స్పందించిన ఆయన అధికారం చేపట్టిన తరువాత సమస్య తీవ్రతను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన ఆదేశాలతో గోపన్నపాలెం - రామసింగవరం వరకు రోడ్డు అభివృద్ధికి రూ.3 కోట్ల నిధులు కేటాయించారు. 2023 సెప్టెంబర్ 3న రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. గోపన్నపాలెం నుంచి ములక్కాయపాడు, దిబ్బగూడెం- లక్ష్మీపురం, పెదవేగి, న్యాయంపల్లి, కూచింపూడి గ్రామాల మీదుగా రామసింగవరం వరకు రోడ్డు నిర్మాణం పూర్తవడంతో ఆయా గ్రామాల ప్రజలు, వాహనచోదకులు మంగళవారం సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి కతజ్ఞతలు తెలుపుతున్నారు.